

యోగాతో ప్రశాంతత : కలెక్టర్



యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఈఓ పెంచల కిషోర్

ప్రజాశక్తి- ఐరాల

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా మంగళవారం ఉదయం శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం వద్ద పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పర్యాటకశాఖ ఆర్‌డి రమణ ప్రసాద్, డివిఎం శ్రీనివాసరావు, జిల్లా పర్యటక శాఖ అధికారిణి గౌరీ, ఈవో పెంచాల కిషోర్‌తో కలసి ఉచిత యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా వలన శ్వాస, ప్రశాంతత పెరుగుతుందని ప్రతి ఒక్కరు రోజు యోగా చేయాలన్నారు. రోజూ యోగా చేయడం వలన ఒత్తిడి నుండి విముక్తి పొందగలమని, మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం యోగ గురువు చెప్పిన విధంగా అందరూ యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, ఈవోఆర్‌డి ఓ.భవాని, డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ చిట్టెమ్మ, డిఎస్‌పి బాలాజీ, బిసి సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ బాషా, తవణంపల్లి తహశీల్దార్ సుధాకర్, సర్పంచ్ శాంతసాగర్ రెడ్డి, యోగా గురువులు శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

తవణంపల్లి: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యోగపై వీడియో కాన్ఫిరెన్స్ జరిగింది. జూన్ నెల 21వ తేదీ వరకు జరిగే యోగా కార్యక్రమాలను సమర్థవంతా నిర్వహించాలని, ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు యోగా కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో టి.హరి ప్రసాద్‌రెడ్డి, ఈవోపీఆర్డి రాఘవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

యోగా మాస్టర్ శిక్షణ విజయవంతం

చిత్తూరు అర్బన్: 11వ అంతర్జాతీయ యోగా శిక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో యోగా మాస్టర్ శిక్షణ కార్యక్రమంను విజయ వంతంగా పూర్తి చేశామని సమగ్ర శిక్ష ఏపిసి వెంకటరమణ తెలిపారు. మంగళవారం పివికేఎన్ ప్రభుత్వ కళాశాల యోగా హాల్‌లో ఫిజికల్ డైరెక్టర్లు, పిఈటిలకు శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపిసి, జిల్లా విద్యాధికారి వరలక్ష్మి, డిఎస్‌డిఓ బాలాజీ, జిసిడిఓ ఇంద్రాణి, ఆయుష్ డాక్టర్లు ప్రసన్న లక్ష్మి, డిఏఓ నోడల్ ఆఫీసర్, చిత్తూరు వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షులు రవీంద్రరెడ్డి, నూర్ మహమ్మద్, బాబు, యోగా మాస్టర్ ట్రైనర్లులకు శిక్షణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఏపిసి, డీఈవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెల రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ శిక్షణ కార్యక్రమంను విజయ వంతంగా పూర్తి చేశామని, యోగ చేయడం వల్ల కలిగే ఆరోగ్య లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొందిన ఫిజికల్ డైరెక్టర్లు, పిఈటిలు శిక్షణానంతరం వారి విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.

దేశ సమైక్యతను కాపాడుకుందాం..

భారత్‌పై అమెరికా పెత్తనం నశించాలి.. ఉగ్రవాదం నశించాలి..

సమైక్యతా యాత్రలో సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు



ర్యాలీలో పాల్గొన్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: ఉగ్రవాదం నశించాలని భారతదేశంపై అమెరికా పెత్తనం నశించాలని, దేశ సమైక్యతను కాపాడాలని సిపిఎం ఆధ్వర్యంలో పలమనేరు పురవీధులలో మంగళవారం సమైక్యత యాత్ర నిర్వహించడం జరిగింది. ఈయాత్రలో పాల్గొన్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదంను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని మతాలకు అతీతంగా చూడాలని ఏ మతంలో ఉగ్రవాదం ఉన్నా దానిని తీవ్రంగా ఖండించాలని అన్నారు. అయితే అధికారంలో ఉన్న మతోన్మాదం బిజెపి ప్రభుత్వం ఉగ్రవాదాన్ని కూడా మతాన్ని అడ్డుపెట్టి రెచ్చగొట్టే పని చేయడం దుర్మార్గమన్నారు. లౌకికదేశంలో కులాలకు మతాలకు అతీతంగా పరిపాలన ఉండాలని తెలిపారు. వ్యాపారం కోసం పాకిస్తాన్, భారత్‌లతో ఆడుకుంటున్న అమెరికా అధ్యక్షులు ట్రంప్ వైఖరిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. భారతదేశం ప్రజలపై భారాలు మోపడానికి భారత్‌పై ఆంక్షలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం దారుణమన్నారు. అమెరికా తీరుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈ సమైక్యత యాత్రలు కొనసాగిస్తున్నమని ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ ఉక్కును కాపాడుతామని ప్రైవేటీకరణ అడ్డుకుంటామని గొప్పగా ఉపన్యాసాలు ఇచ్చారని అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంలోని ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటు వేగవంతం చేస్తుంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు స్పందించకపోవడం దారుణమని, ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను మూడు వేల మందిని తొలగిస్తే నోరు మెదపడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను రాష్ట్రంలో ఉన్న కూటమి పార్టీలు వ్యతిరేకించాలని, అమెరికా ఆంక్షలపై స్పందించాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో ఉన్న ప్రజాసమస్యలపై దశలవారి పోరాటాలకు సిపిఎం సిద్ధమవుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్త, పట్టణ నాయకులు లక్ష్మయ్య, ధనలక్ష్మి శ్రీరాములు, సలీం, సుధాకర్, అమరావతమ్మ, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

హై రోడ్డు విస్తరణ వేగవంతం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు హైరోడ్డు విస్తరణలో భాగంగా మంగళవారం కీలకమైన అడుగు పడింది. 100 అడుగుల రోడ్డు విస్తరణలో భాగంగా ఇప్పటివరకు ప్రభుత్వ స్థలాలను క్లియర్ చేసిన చిత్తూరు నగరపాలక సంస్థ తదుపరి అడుగును వేసింది. చిత్తూరు ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాలతో.. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర నేతృత్వంలో మంగళవారం విస్తరణ పనులు జరిగాయి. ఇందులో భాగంగా తిరుపతి రోడ్డులో కట్టమంచి వద్దనున్న ప్రైవేట్ బిల్డింగ్‌ను యజమాని సహకారంతో రోడ్డు స్థలంలో నిర్మించిన కొంత భాగాన్ని కూల్చివేయడం జరిగింది. చిత్తూరు నగర మేయర్ ఆముద ఈ పనులను పర్యవేక్షించడం జరిగినది. ఈ కార్యక్రమంలో స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న నగర మేయర్ అముద

ప్రహరీ గోడలకు నోచుకోని అంగన్వాడీ కేంద్రాలు





- 2017లో నారా లోకేష్ ప్రారంభించిన అంగన్వాడీ కేంద్రం - ప్రహరీ గోడ లేని అంగన్‌వాడీ కేంద్రం

ప్రజాశక్తి- సోమల: మండలంలోని అంగన్వాడీ కేంద్రాలకు ప్రహరీ గోడలు లేకపోవడంతో చిన్నారులు అంగన్వాడీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరికిపెంట హరిజనవాడ వద్ద 2017 సంవత్సరంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ ప్రైమరీ స్కూల్ నూతన భవనాన్ని అప్పటి పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, సమాచార సాంకేతికశాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. అప్పట్లోనే ప్రహరీ గోడ నిర్మాణానికి కూడా నిధులు మంజూరు అయ్యాయి. ఏ కారణం చేతనో ప్రహరీ గోడ నిర్మాణం జరగలేదు. నేటికీ ప్రహరీ గోడ లేకపోవడంతో పుంగనూరు-సోమల ప్రధాన రహదారి పక్కనే అంగన్వాడీ కేంద్రం ఉండడంతో చిన్నారుల భద్రతకు ఇబ్బందిగా మారుతోంది.

అదేవిధంగా సోమల హరిజనవాడ, నాగిళ్ల వారి పల్లి అంగన్వాడీ కేంద్రాలకు కూడా ప్రహరీ గోడ లేదు. ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రానికి విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇంతవరకు మరుగుదొడ్ల నిర్మాణం జరగలేదు. పేటూరు అంగన్వాడీ కేంద్రానికి కూడా మరుగుదొడ్ల నిర్మాణం లేదు. తుడుంవారిపల్లి, సోమల హరిజనవాడ, పెద్దఉప్పరపల్లి 2 అంగన్వాడీ కేంద్రాలకు తాగునీటి సరఫరా కోసం పైపులైన్ల ఏర్పాటు ట్యాంక్ మోటారు ఎంపీడీవో కార్యాలయ నిధులతో ఏర్పాటు చేయనున్నామని, ఇరికిపెంట హరిజనవాడ అంగన్వాడీ కేంద్రం ప్రహరీ గోడ నిర్మాణానికి నూతనంగా ప్రతిపాదనలు పంపామని, కందూరు1 అంగన్వాడీ కేంద్రానికి తాగునీటి పైప్లైన్ అవసరం ఉందని అయితే నాడు- నేడు కింద పనులు చేపట్టడం వల్ల పనులు పూర్తి కాలేదని, దీని వలన నీటి సౌకర్యం కల్పించలేకపోతున్నామని ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత తెలిపారు. ఏది ఏమైనా విద్యార్థుల భద్రత, సౌకర్యం అంశాలను పరిగణలోకి తీసుకొని మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాన్ని, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంత అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలి

ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సిహెచ్ ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి- కుప్పంరూరల్: ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని రాష్ట్ర ఏపీఎస్ ఆర్‌టీసీ ఎండి ద్వారక తిరుమలరావు సూచించారు. మంగళవారం కుప్పం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్టిసి ఎండితో పాటు కడా పీడీ వికాస్ మరమ్మత్, ఈడీలు చెంగల్ రెడ్డి, అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడా పీడి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పం డిపోలో త్వరితగతిన విద్యుత్ బస్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం కార్యచరణ సిద్ధమైందని, త్వరలో కుప్పం ప్రజలకు విద్యుత్ బస్సుల అందుబాటులో రానున్నట్టు తెలిపారు. ఆర్టీసీ ఎండి మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, వారికి మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలని, ప్రయాణికులకు సేవలు అందించడమే ఆర్టీసీ ప్రథమ లక్ష్మమన్నారు. రాష్ట్రంలోనే ఆర్టీసీను మోడ్రన్ డిపోగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, అధునాతన సౌకర్యాలతో కూడిన డిపో నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభం కానున్నట్టు తెలిపారు. అలాగే సంస్థ ఉద్యోగులకు బకాయిలు చెల్లించడానికి సైతం ఆదేశాలు జారీ చేయనున్నట్టు తెలిపారు.

పలమనేరు: ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సిహెచ్ ద్వారకా తిరుమలరావు పలమనేరు డిపోను పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. మంగళవారం డిపో పరిధిలో పనిచేస ఉద్యోగులకు సన్మాన కార్యాక్రమంలో భాగాం ఆదర్శ ఉద్యోగులను ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేసే డ్రైవర్లు, కండక్టర్లు అందరూ ప్రభుత్వ ఉద్యోగులేనని, వారికి అందాల్సిన బెనిఫిట్లను అన్నింటిని సకాలంలో అందేవిధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారకా తిరుమలరావు

గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల

బాలికల ఆశ్రమ పాఠశాలగా మార్పు

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.మూర్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రామకుప్పం మండలం, విజలాపురం గ్రామంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలగా మార్పు చేయడం జరిగిందని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రామకుప్పం మండలం, విజలాపురం గ్రామంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను ఈ విద్య సంవత్సరం 2025 - 2026 నుండి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలగా మార్పు చేయడం జరిగిందని తెలిపారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 2025 - 2026 ఈ విద్యా సంవత్సరంకు నేటి మే 28 నుండి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల విజలాపురంలో 3వ తరగతి నుండి 8వ తరగతి వరకు బాలికలకు మాత్రమే అడ్మిషన్లు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కుప్పం నియోజకవర్గం పరిధిలో, జిల్లాలో ఉన్న గిరిజన బాలికలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను గిరిజన ఆశ్రమ పాఠశాలగా మార్పు గురించి గిరిజన ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు గిరిజన గ్రామాలలో గిరిజన ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి 3 నుంచి 8వ తరగతి వరకు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చేర్పించడానికి సహకరించాలని కోరారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో చేరడానికి సంబంధించి ఏమైనా సందేహాలు ఉన్నా, పూర్తి వివరాలు కోసం ఆశ్రమ పాఠశాల హెడ్ మాస్టర్ (హెచ్ఎం) వెంకటేశ్వర్ బాబును 95028 06425 లేదా జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి 94411 40202 - 94909 57021 పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపు ఫోన్ ద్వారా పూర్తి వివరాలను తెలుసుకోవచ్చునని ఆయన తెలిపారు.

సర్వాంగ సుందరంగా కైలాస ధామం

6న అధికారికంగా ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని కైలాసపురంలో నూతనంగా అధునాతన సౌకర్యాలతో మొట్టమొదటిసారిగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దాతల సహాయ సహకారాలతో సుమారు రూ.మూడు కోట్ల విలువైన కైలాస దామ నిర్మాణం జరిగింది. ఇందులో కరెంటు ఆధారిత గ్యాస్‌తో బర్నింగ్ అయ్యే మిషన్ ఏర్పాటు చేశారు. దశదిన కర్మలు నిర్వహించడానికి ప్రత్యేక వేదికను, దింపుడు కల్లం ప్రత్యేకమైన స్థలం, ఆడవారికి, మగవారికి ప్రత్యేక స్నానపు గదులు, చుట్టూ పరిసరాల్లో చక్కటి ఉద్యానవనం ఏర్పాటు చేశారు. అలాగే 24 అడుగుల మహాశివుని విగ్రహం, రాతి వినాయకస్వామి ఆలయం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చనిపోయిన వారి ఇంటి వద్దకే శవపేటికను పంపించడం అలాగే అంతిమయాత్ర రథాన్ని సైతం ఏర్పాటు చేసి అతి తక్కువ ఖర్చుతో దహన సంస్కరణ ఏర్పాటు చేయడంతోపాటు ఆస్తికలను భద్రపరుచుకునేందుకు వ్యక్తిగత లాకర్లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 6న అధికారికంగా మంత్రి, ఎమ్మెల్యేలచే ప్రారంభోత్సవం చేసి ప్రజలకు అంకితం ఇవ్వనున్నట్లు ఆర్యవైశ్య సంఘం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.



పోలీసు మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మార్చి 31వ తేదీన అనారోగ్యం కారణంగా మరణించిన కానిస్టేబుల్ కుబెంద్రా సతీమణి శివాణికి, అలాగే ఫిబ్రవరి 2వ తేదీ క్లాస్ - 4 ఎంప్లాయ్‌గా చిత్తూరులో విధులు నిర్వహిస్తూ మరణించిన శ్యామల కుమారి కుమారుడు ప్రశాంత్‌కి కార్పస్ ఫండ్ నుండి మంగళవారం ఒక్కొక్కరికి రూ.1,00,000ల చొప్పున మొత్తం 2 లక్షల రూపాయల చెక్కులను చిత్తూరు జిల్లా ఎస్పీ విఎన్.మణికంఠ చందోలు అందించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ బి-సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, క్లర్క్ పార్థసారధి నాయుడు సమక్షంలో ఎస్పీ ఆఫీస్‌లో మృతుల కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ చనిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, పోలీస్‌శాఖ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ డిపార్టుమెంటు తరపున కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలు ఆలస్యమవ్వకుండా చూస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే నిరభ్యంతరంగా సంప్రదించవచ్చని తెలిపారు.



పోలీస్ మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రతి మహిళా వ్యాపార వేత్తగా ఎదగాలి



సంఘం సభ్యులను రుణాలపై అవగాహన కల్పిస్తున్న డీఆర్డీఎ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రతి మహిళా ఒక వ్యాపార వేతగా ఎదగాలని డీఆర్‌డీఎ పీడీ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సబ్సిడీ ద్వారా బ్యాంకుల్లో అందించే రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి మహిళా ఒక వ్యాపార వేతగా ఎదిగాలని పిలుపునిచ్చారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని, మహిళలకు ఎప్పుడు రుణాలు కావాలన్నా అప్పుడు పెట్టుకోవ్చని చెప్పారు. ముఖ్యంగా వ్యాపారం చేసే వారికి రుణాలు తప్పనిసరిగా అందే విధంగా చూస్తామన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న టైలరింగ్ ఉచిత శిక్షణను పరిశీలించారు.ఇన్చార్జి ఎంపీడీవో విద్యావతి, ఏపీఎం కవిత ఉన్నారు.

మహానాడుకు కదిలిన టిడిపి ప్రజాప్రతినిధులు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కడప వేదికగా నిర్వహిస్తున్న మొదటి రోజు మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు మహానాడు వేదిక వద్దకు బయలుదేరి వెళుతున్న చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళి మోహన్‌లు. అలాగే చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో చిత్తూరు నగరపాలక, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల సీనియర్ నాయకులు, క్లస్టర్, డివిజన్ ఇన్చార్జిలు మంగళవారం ఉదయం ఎమ్మెల్యే గారి నివాసం నుంచి మహానాడు కోసం కడప బయలుదేరి వెళ్లారు. వీరితోపాటు గంగాధర నెల్లూరు నియోజకవర్గం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బి.ఎం థామస్, ఆయతోపాటు మండల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. బంగారుపాళ్యం నుంచి మండల అధ్యక్షులు ధరణి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్, నాయకులు సూరి నాయుడు, హరి తదితరులు పాల్గొన్నారు.



కాలువల్లో పూడికతీత పనులు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో నగరపాలక పరిధిలో కాలువల్లో ముందస్తుగా పూడికతీత పనులు చేపట్టాలని మేయర్ ఎస్.అముద సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మేయర్ కట్టమంచిలో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని పెద్ద, మధ్యస్థ, చిన్న కాలువలన్నింటిలో పూర్తిస్థాయిలో పూడిక తొలగించాలన్నారు. వర్షాకాలంలో ఎక్కడా కాలువలు బ్లాక్ కాకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో అన్ని వార్డుల్లో జరుగుతున్న పూడికతీత పనుల వివరాలను ఎంహెచ్వో డాక్టర్ లోకేష్ వివరించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగా అన్ని వార్డుల్లోనూ పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులకు తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం ఉదయం 9గంటలకు చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు పల్లకి వాహనంపై గ్రామవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. అంతకు ముందు ఆలయంలో మూలవిరాట్‌ను వేకువ జామున సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అలాగే చూర్ణాభిషేకం చేపట్టారు. అనంతరం ఊరేగింపుగా స్కంధపుష్కరణి వద్దకు చేరుకున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవర్లతో పాటు చక్రతాళ్వార్కు వేద పండితులు వేదమంత్రాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణం నడుమ స్కంధపుష్కరిణీలో చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. పురష్కరిణీ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గజ ఈతగాళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉభయ నాంచారులతో వేణుగోపాలుడు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, ఆలయ అధికారి సురేష్ కుమార్, షరాబ్, బాబుసురేష్, వేదపండితులు నారాయణదాశరథి, గోపాలాచారి, శభరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌'ఫార్మర్‌' కష్టాలు

డీడీలు కట్టి ఏళ్లు గడుస్తున్నా...
కొత్తవి ఇవ్వరు..మరమ్మతులు చేయరు..
చేయి తడిపితేనే పనులు ముందుకు..
విద్యుత్‌శాఖలో 'అక్రమాల' జోరు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఖరీఫ్‌ సీజన్‌ తరుముకొస్తోంది. వచ్చే నెల ప్రారంభం నుంచి రైతులు సాగుకు సమాయత్తమవుతారు. ఈ సమయంలో వారిని ట్రాన్స్‌ఫార్మర్‌ కష్టాలు వెంటాడుతున్నాయి. ఏళ్ల కొద్దీ వందల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం పదుల సంఖ్యలో మాత్రమే మంజూరు చేస్తోంది. క్షేత్రస్థాయిలో వాటిని ఏర్పాటు చేసే క్రమంలో మెటీరియల్‌ పూర్తిస్థాయిలో ఇవ్వకపోతుండడంతో రైతులు మరికొంత ఆర్థిక కష్టాలు పడాల్సివస్తోంది. అధికారులు, కాంట్రాక్టర్ల చేతివాటం అదనపు భారమవుతోంది. దీంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒక నెల దాటిన తర్వాత ప్రభుత్వం ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేసినా పంటల సాగు ప్రారంభమై వాటిని పొలాల్లోకి తీసుకెళ్లడం కష్టమవుతుంది. సాధ్యమైన మేర ఖరీఫ్‌ ప్రారంభానికి ముందే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తేనే ఈ సంవత్సరమైనా బోర్లు, బావులు, కాలువల ద్వారా వ్యవసాయం చేయగలుగుతామని రైతులు అంటున్నారు. కొత్త వాటి పరిస్థితి ఇలా ఉంటే మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి ఇలానే ఉందని రైతులు వాపోతున్నారు. పాడైపోయి నెలలు గడుస్తున్నా మరమ్మత్తులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీడీలు కట్టినా మంజూరుకాని వైనం

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం శ్రీకాళహస్తి విద్యుత్‌ సబ్‌ డివిజన్‌ పరిధిలో రైతులు డీడీలు తీసి రెండు, మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. పెండింగ్‌ లో ఉన్న వాటి సంఖ్య వందల్లో ఉన్నా మంజూరవుతున్నవి కేవలం పదుల సంఖ్యలోనే ఉన్నాయి. అయితే తాము మాత్రం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ నెల రోజుల కిందటే కొత్త ట్రాన్స్‌ పార్మర్లు అమర్చేసినట్లు ఎస్పీడీసీఎల్‌ అధికారులు చెబుతుండడం గమనార్హం.

చేయి తడిపితేనే పనులు ముందుకు

రైతులకు విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ కావాలంటే కేవలం డీడీలు తీస్తేనే సరిపోదు. కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు అందరికీ చేతులు తడపాల్సిందే. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు డీడీలకు చెల్లించింది కాక మరో రూ.20వేల వరకు లంచాలు ఇస్తేనే పొలంలోకి చేరుతుంది. గ్రామస్థాయిలో ఉండే లైన్‌మన్‌ మొదలుకొని అందరికీ అదనపు చెల్లింపుల్లో వాటాలు సర్వసాధారణం. అన్నీ సజావుగా ఉండి ట్రాన్స్‌ఫార్మర్‌ మంజూరైనా మెటీరియల్‌ పూర్తిస్థాయిలో రాలేదని కాంట్రాక్టర్‌లు కొర్రీలు వేస్తున్నారు. కొంత సామగ్రి ప్రైవేటుగా కొనుగోలు చేయాలని రైతులపై అదనపు భారాన్ని వేస్తున్నారు. అదనపు మెటీరియల్‌ పేరుతో ఎంతలేదన్నా మరో రూ.5వేల వరకు అధికంగా రైతులు ఖర్చు పెట్టాల్సివస్తోంది. తొట్టంబేడు మండలంలోని చేమూరులో నూతన ట్రాన్స్‌ ఫార్మర్‌ ఏర్పాటుకు కాంట్రాక్టర్‌ వేలల్లో డిమాండ్‌ చేసినట్లు బాధిత రైతు వాపోయాడు.

మరమ్మతుల్లో జాప్యం

శ్రీకాళహస్తి విద్యుత్‌ సబ్‌డివిజన్‌ పరిధిలో వ్యవసాయ బోర్లకు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు ఇటీవల కురిసిన అకాల వర్షాలు, పిడుగులకు పెద్ద ఎత్తున కాలిపోయాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి నిర్లక్ష్యం వల్ల బోర్ల కింద సాగులో ఉన్న పంటలు కోల్పోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీఆర్‌ బుక్‌ చేసిన 48 గంటల్లో గా పాడైన ట్రాన్స్‌ ఫార్మర్లను బాగు చేయాల్సి ఉంది. అవసరమైతే వాటి స్థానంలో కొత్తవి అమర్చాలి. కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం పీఆర్‌లు బుక్‌ చేసి నెల రోజులైనా అధికారులు స్పందించలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం విద్యుత్‌ సెక్షన్‌ ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నామని రైతులు వాపోతున్నారు. మంగళవారం మన్నసముద్రం, కే బి బి పురం, కాట్రపల్లి, గొట్టిపూడి తదితర గ్రామాలకు చెందిన సుమారు పదిమంది రైతులు శ్రీకాళహస్తి ఎస్పీడీసీఎల్‌ కార్యాలయం వద్ద నిరీక్షించిన పరిస్థితి కనబడింది. కొన్నిచోట్ల మరమ్మత్తులు చేసి ఇచ్చిన ట్రాన్స్‌ ఫార్మర్లు నెల తిరగకముందే పాడైపోయాయని రైతులు వాపోయారు.

నెలన్నరకే పాడైంది: నాగరాజు, రైతు, మనసముద్రం

ఇటీవల కురిసిన అకాల వర్షానికి ట్రాన్స్‌ ఫార్మర్‌ దెబ్బతింది. తామే ట్రాన్స్‌ ఫార్మర్‌ ను కరెంట్‌ ఆఫీస్‌ కి తీసుకొస్తే మరమ్మత్తులు చేసి ఇచ్చారు. నెలన్నర రోజులకే ట్రాన్స్‌ ఫార్మర్‌ మళ్లీ మరమ్మతుకు గురైంది. ఇదేంటని ప్రశ్నిస్తే కుంటి సాకులు చెబుతున్నారు. మరమ్మత్తు పనులు నాసిరకంగా జరగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

5 నిముషాలకే కాలిపోయింది: రమణా రెడ్డి, రైతు, రాంభట్లపల్లి

ట్రాన్స్‌ ఫార్మర్‌ మరమ్మతులకు గురైతే బాగు చేయించి ఇచ్చారు. ఆదివారం పెట్టిన ఐదు నిమిషాలకే కాలిపోయింది. మళ్లీ సొంత ఖర్చులతో పాడైన ట్రాన్స్‌ ఫార్మర్‌ ను కరెంటు ఆఫీస్‌ కి తీసుకొచ్చాం. ఇలా ప్రయాణ ఖర్చులు, ఫిట్టింగ్‌ ఖర్చులు తడిసి మోపెడయ్యాయి.

అన్ని ఇచ్చేసాం : సుధాకర్‌, ఏడి, శ్రీకాళహస్తి

మా పరిధిలో ఉన్న అన్ని కొత్త వ్యవసాయ విద్యుత్‌ ట్రాన్స్‌ ఫార్మర్లను రైతులకు అందజేశాం. మరమ్మత్తులు కూడా పూర్తి చేశాం. మెటీరియల్‌ పనులు మాత్రమే కొంతమేర పెండింగ్‌ లో ఉన్నాయి.

అర్ధరాత్రి బుల్‌డోజర్లతో...



కరెంట్‌ కట్‌చేసి, ఫోన్లు పగలగొట్టి...
వేణుగోపాల్‌ కాలనీలో 80 ఇళ్లు కూల్చివేత
పథకం ప్రకారమే ఇళ్లను కూల్చారు : సిపిఎం
కోర్టు వివాద స్థలమని తెలియదు : బాధితులు
పేద, మధ్యతరగతి వారే సమిధలు



కూల్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర నేత వై.వెంకటేశ్వరరావు

అర్ధరాత్రి.. కరెంట్‌ కట్‌ చేసేశారు.. సెల్‌ఫోన్లు ధ్వంసం చేశారు.. బుల్‌డోజర్లు తీసుకొచ్చి అక్రమంగా ఇళ్లల్లో చొరబడ్డారు.. ముసలీ ముతక అని చూడకుండా ఇళ్లల్లోనుంచి వాళ్లను బయటకు లాగేశారు.. ఇళ్లను కూల్చేశారు.. వస్తువులను ధ్వంసం చేశారు.. విలువైన వాటిని అపహరించారు.. తెల్లవారుజామున మొండిగోడల మధ్య బాధితులు కన్నీరుమున్నీరవుతూ కనిపించారు.. ఈ బుల్‌డోజర్‌ సంస్కృతి ఎక్కడో కాదు.. తిరుపతి శివారు ప్రాంతమైన మంగళం పరిధిలోని తిరుమలనగర్‌ పంచాయతీలో వేణుగోపాల్‌ కాలనీవాసులది.. దాదాపు 80 ఇళ్లు నేలమట్టమయ్యాయి. వీరంతా పేద మధ్యతరగతి ప్రజలే. తమ పేర్లతో పక్కాగా రిజిస్ట్రేషన్‌ అయి ఉందని, పంచాయతీకి పన్ను కడుతున్నామని, కరెంట్‌ మీటర్లు తమ పేరుతో ఉన్నాయని, బ్యాంకుల్లోనూ లోన్లు ఇచ్చారని బాధితులు వాపోతున్నారు. కూలినాలి చేసుకుని అంతోఇంతో మిగుల్చుకుని కొనుగోలు చేసుకుని ఇళ్లు కట్టుకుంటే అర్ధరాత్రి వచ్చి కూలదోస్తే తాము ఎలా బతకాలన్నది వారి ఆవేదన. 2016-2018 మధ్య ఈ కాలనీని వేసి, ప్లాట్ల క్రయవిక్రయాలను శ్రీనివాసులురెడ్డి, రుద్రగోపి చేశారని వారు గగ్గోలు పెడుతున్నారు.

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్‌ 218/1లోని ఒక ఎకరా 64 సెంట్ల భూమి కోర్టు వివాదాల్లో ఉందని మంగళవారం ఇళ్ళ కూల్చివేత ఘటనతో వెలుగులోకి వచ్చింది. దీనిపై హైకోర్టు, ఆర్డీవో కోర్టు, జిల్లా కోర్టులలో కేసులు నడుస్తున్నాయని సదరు స్థలంలో ప్లాట్లను విక్రయించిన రుద్రగోపి మీడియాకు తెలిపారు. అయితే కోర్టుల్లో వేసిన కేసులను వెనక్కు తీసుకోవాలని నిర్మల, రాజన్‌ బాబు, మునిరెడ్డి అనే కొంతమంది గత మూడు నెలలుగా తనపై ఒత్తిళ్లు తీసుకు వస్తున్నారని, ఈ క్రమంలోనే సదరు స్థలంలో నిర్మించిన ఇళ్లను కూల్చివేసినట్లుగా తెలిపారు. చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్‌ 218/1లోని సర్వే నంబర్‌ తో పాటుగా ఇతర సర్వే నంబర్లను విక్రయ దాక్యుమెంట్లో పేర్కొంటూ రిజిస్ట్రేషన్లు జరిపినట్లుగా తెలుస్తోంది.

గతంలో ప్రస్తుతం ఇల్లు కూల్చివేసిన స్థలాన్ని అమ్మిన వ్యక్తులు ఒకరికి జిపిఏ చేయకుండా ఇద్దరు వ్యక్తులకు జిపీఏలు చేసినట్లుగా సమాచారం. చిన్నమ్మ, మునికష్ణారెడ్డి, గోపాల్‌ రెడ్డి, మునిరామిరెడ్డి, రఘునాథ రెడ్డి వద్దనుండి కొనుగోలు చేసిన వ్యక్తుల్లో ఒకరు వారి కుమార్తె అయిన నిర్మలకు గిఫ్ట్‌ డీడ్‌ కింద స్థలాన్ని రాసి ఇచ్చినట్లుగా సమాచారం. ఇదే భూమిపై రుద్రగోపి, శ్రీనివాసరెడ్డిలు కూడా జిపిఎ పొందినట్లుగా తెలుస్తోంది. వీరిదగ్గర స్థలాలను కొనుగోలు చేసిన వారిలో 15 మంది పోలీసులూ ఉన్నట్లు సమాచారం.



స్పందించని పంచాయతీ కార్యదర్శి

కోర్టు వివాదంలో ఉన్న స్థలానికి సాధారణంగా పన్నులు మంజూరు చేయరు. అయితే మంగళవారం వేణుగోపాల కాలనీలో కూల్చివేయబడ్డ ఇళ్లలో తిరుమల నగర్‌ గ్రామపంచాయతీ నుండి 15 ఇళ్లకు సంబంధించి పన్నులు జారీ చేసినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం పంచాయతీ ఇంచార్జ్‌ కార్యదర్శి మురళిని వివరణ కోరగా ఆయన స్పందించలేదు. ఫోన్‌ అందుబాటులో లేదు.

కూల్చిన వారిని కఠినంగా శిక్షించాలి : సిపిఎం

బాధితులు పంచాయతీ నుంచి ఇంటిపన్ను, రెవెన్యూ ఇచ్చిన ఎన్‌ఒసి, కరెంట్‌ డిపార్టుమెంట్‌ ఇచ్చిన మీటర్‌, బ్యాంకుల నుంచి లోన్లు తీసుకున్నారని, అన్ని రకాలుగా వీరు చట్టబద్ధంగా కొనుగోలు చేసి, ఇళ్లు కట్టుకుని, కాపురాలు ఉన్న వారిపై దౌర్జన్యంగా బుల్‌డోజర్లు తెచ్చి, భయానక వాతావరణంలో ఇళ్లను కూల్చివేయడం దారుణమని సిపిఎం రాష్ట్ర నేత వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఖండించారు. ఇదే అదనుగా విలువైన వస్తువులను అపహరించుకుపోయారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, దౌర్జన్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. పేదలు సమిధలయ్యారని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం బాధితులను పరామర్శించి సిపిఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నేను జాయిన్‌ అవ్వకముందు ఇచ్చి ఉండొచ్చు :
మోహన్‌, ఎఇ, విద్యుత్‌ శాఖ, మంగళం

తిరుమల నగర్‌ గ్రామపంచాయతీ వేణుగోపాల కాలనీలో తాను డ్యూటీలో చేరకముందు ఇచ్చి ఉండొచ్చు. ప్రస్తుతం రిజిస్టర్డ్‌ భూమి కాకుండా డీకేటి భూములలో ఎవరైనా ఇల్లు నిర్మించుకొని విద్యుత్‌ కనెక్షన్లు కావాలని కోరితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఆ స్థలంకు సంబంధించి ఎన్‌ఓసి ఇవ్వాల్సి ఉంటుంది. అలా ఉంటేనే విద్యుత్‌ కనెక్షన్లు ఇస్తాం.

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే సరుకులు

ప్రజాశక్తి- సోమల

జూన్‌ ఒకటవ తేదీ నుండి చౌక దుకాణాల వద్దనే నిత్యావసర సరుకులను కార్డుదారులకు అందజేయాలని, ఇదే క్రమంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు వారి ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు చేర్చే బాధ్యత డీలర్లు తీసుకోవాలని తహశీల్దార్‌ బెన్నురాజ్‌ అన్నారు. మంగళవారం తహశీల్దార్‌ కార్యాలయంలో చౌకదుకాణ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం జూన్‌ నెల 1వ తేదీ నుండి అందరూ చౌక దుకాణ డీలర్లు తమ చౌక దుకాణం వద్ద నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని చౌక దుకాణం వద్ద డీలర్‌ పేరు మొబైల్‌ నెంబర్‌ స్టాక్‌ వివరాలు తప్పకుండా డిస్ప్లే చేయాలని, నిత్యావసర సరుకుల పంపిణీ తూకాల్లో తేడా వస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమయపాలన పాటిస్తూ ఒకటవ తేదీ నుండి 15వ తేదీ వరకు కచ్చితంగా చౌక దుకాణం తెరిచి ఉంచాలని, సరుకులు పంపిణీ చేయాలని, కార్డుదారులతో గౌరవంగా మాట్లాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కుత్బులుల్లా, చౌక దుకాణ డీలర్లు వీఆర్వోలు పాల్గొన్నారు.

స్టాక్‌ పాయింట్‌కు చేరిన విద్యాసామగ్రి

ప్రజాశక్తి- సోమల

మండల కేంద్రమైన సోమలలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల స్టాక్‌ పాయింట్‌కు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకంలో భాగంగా విద్యాసామగ్రి చేరుకుంటున్నాయి. మండల విద్యాశాఖ అధికారులు కేశవరెడ్డి, శివరత్నమ్మ మాట్లాడుతూ మండలంలోని ఒకటవ తరగతి నుండి పదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కొరకు ఎస్‌ఆర్‌కెవిఎం పథకంలో భాగంగా అచ్చు పుస్తకాలు, నోట్‌ పుస్తకాలు, డిక్షనరీ, బెల్టు, షూలు, యూనిఫామ్‌, బ్యాగ్‌, విద్యాశాఖ నుంచి స్టాక్‌ పాయింట్‌కు చేరుతున్నాయని మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 మోడల్‌ ప్రైమరీ పాఠశాలలు, 41 ఫౌండేషన్‌ బేసిక్‌ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పాఠశాలలు తెరవగానే ఆయా పాఠశాలల స్ట్రెంత్‌ను బట్టి విద్యాసామగ్రి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య విద్యాసామగ్రి మధ్యాహ్న భోజనం ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలలు ఉన్నాయని వీటిని మండలంలోని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారు కోరారు.

వేడుకగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గంగమ్మ జాతర మంగళవారం మండలంలోని మొగిలి వెంకటగిరి, తుంబకుప్పం గ్రామాల్లో వేడుకగా జరిగింది. ఈ గ్రామాల్లోని ఆలయాలు విద్యుత్‌ దీపఅలంకరణలతో అలంకరించి గంగమ్మ జాతర వైభవాన్ని నిర్వహించారు. ఉదయం గంగమ్మ శిరస్సును ప్రతిష్టించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి అంబళ్లు పోశారు. సాయంత్రం పొంగలిపెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని ముక్కలతూరు గ్రామంలో మంగళవారం గంగ జాతర వైభవంగా జరిగింది. గ్రామస్తుల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి అంబళ్లు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించి అత్యంత భక్తిశ్రద్ధలతో జాతర నిర్వహించారు. నిర్వాహకుల ఏర్పాటు చేసిన హరికథా కాలక్షేపం, ప్రత్యేక నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ధర్మకర్తల ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. బుధవారం సాయంత్రం అమ్మవారినినిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

'మామిడి గిట్టుబాటు ధర కల్పించాలి'

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మామిడి గిట్టుబాట ధర కల్పించాలని జనసేన మండల నాయకులు ఆవుల శాంతమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలో ఒక లక్ష 14 హెక్టార్ల లో సుమారు 16 లక్షల టన్నులు మామిడి పంట ఉత్పత్తి అవుతోందని, మామిడి పంటపై రైతులు ఎన్నో ఆశతో ఉన్నారని మామిడికి తగిన గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం మామిడి పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రకృతి విపత్తుల నుండి కాపాడి నష్టాల లేకుండా చూడాలని, దళారీ వ్యవస్థ నుండి కాపాడాలని డిమాండ్‌ చేశారు. అలాగే జిల్లాలో ప్రత్యేక మ్యాంగో బోర్డు ఏర్పాటు చేసి రైతులను అన్ని విధాల ఆదుకోవాలన్నారు.

ఎర్రమరెడ్డి పాలెం చెరువు ఆక్రమణను అడ్డుకుంటాం



ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీకి చెందిన ఎర్రమరెడ్డి పాలెం చెరువు ఆక్రమణదారులపై కేసులు పెట్టాలని, లేదంటే గ్రామస్తులు ద్వారా ఫెన్సింగ్‌ను తొలగిస్తామని ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమూరు హేమలత జిల్లా ఇరిగేషన్‌ అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎర్రమరెడ్డిపాలెం గ్రామ చెరువు సర్వే నెంబర్‌ 141 లో సుమారు 55 ఎకరాలు ఉండగా అందులో 10 ఎకరాల 50 సెంట్లు చెరువు మునగడ స్థలం ఆక్రమణకు గురైందని తెలిపారు. కొంతమంది ప్రభు, వెంకటయ్య, సుబ్రహ్మణ్యం కలిసి ప్రైవేట్‌ కళ్యాణ్‌ మండపం పేరుతో చెరువు మునగడ స్థలంలో ట్రాక్టర్లతో మట్టితోలి ఫెన్సింగ్‌ వేసినా, ఆక్రమణదారుల నుండి చెరువును కాపాడాలని గ్రామ రైతులు వెళ్లి 'గ్రీవెన్స్‌ డే' లో జిల్లా కలెక్టర్‌ కు, ఇరిగేషన్‌ అధికారులకు అర్జీలు పెట్టిన విషయం గుర్తు చేశారు. ఇంతవరకు అధికారుల నుండి ఎటువంటి స్పందన లేదని, ఆక్రమణదారులు వేసిన ఫెన్సింగ్‌ను రైతు సంఘం ఆధ్వర్యంలో తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రమ రెడ్డిపాలెం గ్రామ రైతులు, సిపిఎం పార్టీ రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌ కొండ్రెడ్డి హరినాథ్‌ వెళ్లి చెరువు ఆక్రమణను పరిశీలించారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్లలో శుభ్రత పాటించాలి



ప్రజాశక్తి - తిరుపతి సిటి: జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్‌ స్టేషన్లలో శుభ్రత పాటించాలని, ఆర్టీసీ బస్సులన్నింటిని సమయ పాలనా ప్రకారం నడపాలని ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులను జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌ వెంకటేశ్వర్‌ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్‌ ఛాంబర్‌ నుండి వీడియో కాన్ఫిరెన్స్‌ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, తిరుపతి జిల్లా లోని అన్ని బస్సు డిపో మేనేజర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బస్‌ స్టేషన్లలో శుభ్రత పాటించాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, టాయిలెట్స్‌ నిర్వహణ, నీటి సౌకర్యం బాగుండాలని ఆదేశించారు. ప్రయాణికులు ప్రయాణించే బస్సులు అన్ని కండిషన్‌ లో ఉండేటట్లు చూసుకుంటూ, ఏదైనా మరమ్మత్తులు వచ్చిన వెంటనే మరమ్మత్తులు చేయాలని, లేని పక్షంలో వేరే బస్సులను వేయాలని తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవలసిన బాధ్యత సంబంధిత డిపో మేనేజర్లదే అని ఆదేశించారు. ప్రయాణికుల సౌకర్యార్థం, సూచిక బోర్డులను, బస్సు టైమింగ్‌ వివరాలను, హెల్ప్‌ డెస్క్‌ ను ప్రతి బస్టాండులో ఏర్పాటు చేయాలని సూచించారు. బస్‌ స్టేషన్లలో గల షాపులలో వుండే వస్తువులను ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని, ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మ రాదని ఆదేశించారు. ఆలా అమ్మిన దుకాణాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎదో ఒక సమయంలో అనుకోకుండా బస్‌ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేస్తానని తెలిపారు. తిరుపతి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కనితి వెంకట్రావు, తిరుపతి బస్‌ స్టేషన్‌ అసిస్టెంట్‌ ట్రాఫిక్‌ మేనేజర్‌ డి రామచంద్ర నాయుడు, తిరుమల డిపో మేనేజర్‌ విశ్వనాథం, తిరుపతి డిపో మేనేజర్‌ బాలాజీ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చేతిలో పేలిన నాటు బాంబు

నుజ్జునుజ్జు అయిన వ్యక్తి చేయి, వేళ్లు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: అంత్యక్రియల్లో భాగంగా టపాకాయలు పేలుస్తుండగా ప్రమాదవశాత్తు నాటు బాంబు చేతిలో పేలడంతో ఓ వ్యక్తి కుడి చేసి నుజ్జునుజ్జు అయిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని చీలంపల్లి గ్రామంలో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం మరణించాడు. అతని అంత్యక్రియల నిర్వహణలో భాగంగా అదే గ్రామానికి చెందిన టి.గణేష్‌ టపాకాయలను అంటిస్తుండగా ప్రమాదవశాత్తు చేతిలో ఉన్న బాంబు పేలడంతో గణేష్‌ కుడిచెయి వేళ్లు, అరచేయి తీవ్రంగా గాయమైంది. స్థానికుల సాకారంతో గణేష్‌ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలించగా డాక్టర్‌ విజయచంద్ర పరిశీలించి పరిస్థితి విషాదంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం 108 వాహనం ద్వారా పలమనేరు ఏరియా హాస్పిటల్‌కి తరలించారు.

భక్తుల భద్రతకు అదనపు సిబ్బంది కేటాయింపు



ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలోని అలిపిరి మెట్లమార్గం, ఘాట్‌ రోడ్డుల వద్ద ఇటీవల కాలంలో వన్యమగాలు, ముఖ్యంగా చిరుతపులుల కదలికలు పెరిగిన నేపథ్యంలో మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణ చర్యలపై మంగళవారం గోకులం సమావేశ మందిరంలో ఉన్నతాధికారుల సమీక్ష సమావేశం జరిగింది. టీటీడీ ఈవో జే. శ్యామల రావు (వర్చువల్‌), అదనపు ఈవో. వెంకయ్య చౌదరితో కలిసి సమావేశం నిర్వహించారు. అలిపిరి మెట్టమార్గంలో భక్తుల భద్రతకు అదనపు సిబ్బందిని కేటాయించనున్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్యశాఖ ద్వారా చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టనున్నారు. టిటిడి అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్‌, ఆరోగ్య, విజిలెన్స్‌ శాఖలతో కలిసి అటవీ శాఖ సమన్వయంతో నడకమార్గంపై నిరంతర జాయింట్‌ డ్రైవ్‌ నిర్వహించనున్నారు. వైల్డ్‌లైఫ్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆవశ్యకతను గుర్తించారు. ఈ సమావేశంలో వైల్డ్‌ లైఫ్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇండియా సీనియర్‌ సైంటిస్ట్‌ డా. రమేష్‌ కష్ణమూర్తి, చీఫ్‌ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్ట్‌ సెల్వం, డి.ఎఫ్‌.ఓ వివేక్‌ ఆనంద్‌ పాల్గొన్నారు.

తిరుపతిలో త్వరలోనే క్రీడా మైదానాలు ఏర్పాటు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతికి అతి త్వరలో ఏసీఏ ఆధ్వర్యంలో క్రీడా మైదానాలు తీసుకొస్తామని ఆంధ్ర క్రికెట్‌ అసోసియేషన్‌ కోశాధికారి దండమూడి శ్రీనివాస్‌ తెలిపారు. చిత్తూరు ప్రీమియర్‌ లీగ్‌(సిపిఎల్‌-1)లో భాగంగా మంగళవారం ఐదవ రోజు మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌ కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ప్రతి ఒక్క జిల్లాలో టర్ఫ్‌ పిచ్చులు తీసుకురావాలనే సంకల్పంతో ఏసిఏ ముందుకు వెళుతున్నదన్నారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో కూడా స్థలాలను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. క్రికెట్‌ క్రీడాకారులకు సరైన ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ కల్పించి జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఆడే విధంగా ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఏసిఏ రాష్ట్ర ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ చైర్మన్‌, చిత్తూరు జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు విజయకుమార్‌(క్రికెట్‌ విజయ), సిడిసిఏ కార్యదర్శి రవి, కోశాధికారి గిరి ప్రకాష్‌, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.


నిరంతర వైద్య 'శ్రామికుడు'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

బర్డ్‌ డైరెక్టర్‌గా ప్రముఖ ఆర్థోపెడిక్‌ సర్జన్‌ డాక్టరు గుడారు జగదీష్‌ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో బర్డు హాస్పిటల్‌ డైరెక్టర్‌గా విశేష అనుభవం గడించిన ఆయన ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పలు హాస్పిటల్స్‌లో సంక్లిష్టమైన ఆర్థో ఆపరేషన్లను లక్షల్లో విజయవంతంగా నిర్వహించిన 'హస్తవాసి'.చలనం లేని కాళ్లకు చైతన్యం తెప్పించారు.. వంగిన వెన్నులకు దన్ను అందించారు.. విరిగిన చేతులను తిరిగి అతికించారు.. ఆయనే వైద్యశ్రామికుడు డాక్టర్‌ గుడారు జగదీష్‌. వైద్యవృత్తిలో నాలుగు దశాబ్దాల అనుభవం ఆయనది.

దక్షిణాసియాలోనే అతి పెద్ద ఎముకల ఆస్పత్రి బాలాజీ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సర్జరీ, రీసెర్చి అండ్‌ రీహేబిలిటేషన్‌ (బర్డ్‌). 37 ఏళ్లపాటు వైద్యునిగా, బోధకునిగా, డైరెక్టర్‌గా ఆ వైద్యాలయంలో ఆయన సేవలను అందించారు. బర్డ్‌ అంటే జగదీష్‌, జగదీష్‌ అంటే బర్డ్‌ అనే ముద్ర కూడా ఆయన చేసిన అభివృద్ధిలో భాగంగా పేరుగడించింది. ప్రముఖ ఆర్థోపెడిక్‌ సర్జన్‌ డాక్టర్‌ వ్యాఘ్రేశ్వరుడి శిష్యుడిగా కెరీర్‌ని ఆరంభించిన జగదీష్‌ వందలమంది యువ వైద్యులకు మార్గనిర్దేశం చేశారు. అంగవైకల్యంతో పుట్టినవారికీ, దివ్యాంగులకూ, ప్రమాదాలబారిన పడ్డవారికీ తన శస్త్రచికిత్సలతో పునర్జన్మనిచ్చారు. ఫ్లోరైడ్‌ బాధితుల కాళ్ల వంకర్లు సరిచేయడం, మోకాళ్ల, వెన్నెముక శస్త్రచికిత్సలూ ఇలా ఇప్పటివరకూ 1.28 లక్షల శస్త్రచికిత్సలు నిర్వహించారు. దేశవ్యాప్తంగానూ అనేక వైద్య శిబిరాల్లో పాల్గొని పోలియోకి ఉచిత స్క్రీనింగ్‌, శస్త్రచికిత్సలు చేశారు. 2019లో బర్డ్‌ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన డాక్టర్‌ జగదీష్‌ తన సేవలను విస్తృతం చేస్తూ రోగుల దగ్గరకే వైద్యాన్ని అందించారు. శారీరక శ్రమ ఎక్కువగా ఉండే మత్స్యకారుల్లో ఎముకల సమస్యలు అధికంగా ఉండటాన్ని గుర్తించి వారుండే ప్రాంతాలకు వెళుతున్నారు. మత్స్యకారులు ఎక్కువగా ఉండే ప్రకాశం జిల్లాలోని కరేడు గ్రామాన్ని ఏడాదిన్నర కిందట దత్తత తీసుకున్నారు. గ్రామంలో ఆర్థోపెడిక్‌ సమస్యలతో బాధపడేవారందరికీ చికిత్స చేసి నయంచేయడమే లక్ష్యంగా లింగారెడ్డి అన్నపూర్ణమ్మ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో వైద్యసేవల్ని ఉచితంగా అందిస్తున్నారు. రోజుకు దాదాపు 60-70 మందికి వైద్యసేవలతోపాటు మందులనూ, వారికి అవసరమయ్యే పరికరాలనూ ఉచితంగా అందజేస్తుంటారు. ఫ్లోరైడ్‌ సమస్య అధికంగా ఉండే ప్రకాశంతోపాటు చిత్తూరు, నెల్లూరు, గుంటూరు, కష్ణా, ఉభయ గోదావరి జిల్లాలకు ప్రతినెలా వెళ్తుంటారు. ఈయన దత్తత గ్రామాల్లో తిరుపతి జిల్లా వెంకటగిరి కూడా ఉంది. అక్కడ జీఎన్‌ఆర్‌ ట్రస్టుద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఒంగోలులోని రమేష్‌ సంఘమిత్ర హాస్పిటల్స్‌, గుంటూరు వడ్లమూడిలోని డీవీసీ ట్రస్టు హాస్పిటల్‌తోపాటు తాను సహ వ్యవస్థాపకుడిగా ఉన్న ద్వారకా తిరుమలలోని విర్డ్‌ ట్రస్టు హాస్పిటల్‌... ఇలా పలుచోట్లకు తరచూ వెళ్తూ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. రాయలసీమతో ఈయనది సుదీర్ఘ అనుబంధం. దాన్ని కొనసాగించాలని తిరుపతిలోని రాష్ట్రీయ సేవా సమితి కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఇక్కడికి కర్ణాటక, తమిళనాడుల నుంచి కూడా రోగులు వస్తుంటారు.

"జీవితం అనేది ఒకటే ఉంటుంది. ఈ చిన్న జీవితంలో ఎంత ఎక్కువ మంది ఆర్థులకు సేవ చేసామన్నదే ముఖ్యం. తండ్రి కోరికమేరకు వైద్య వత్తిలోకి వచ్చాను. తుదిశ్వాస వరకు వీలైనంత ఎక్కువ మంది రోగులకు సేవ చేసి వారి ముఖాల్లో చిరునవ్వులు చూడటం ద్వారా జీవన సాఫల్యత పొందాలన్నదే నా లక్ష్యం."
-డాక్టరు గుడారు జగదీష్‌, బర్డ్‌ డైరెక్టర్‌, తిరుపతి.





బర్డ్‌ డైరెక్టర్‌గా డాక్టరు జగదీష్‌ నేడు బాధ్యతలు స్వీకరణ

కుటుంబమంతా వైద్యసేవలోనే..

కడప జిల్లా పుల్లంపేట మండలంలోని టి.కమ్మపల్లికి చెందిన వ్యవసాయ కుటుంబంలో జన్మించారు జగదీష్‌. తల్లిదండ్రులు లీలావతమ్మ, లక్ష్మయ్యనాయుడు. డాక్టర్‌ కావాలన్న తన లక్ష్యం నెరవేరకపోవడంతో పిల్లల చదువుల కోసం కుటుంబాన్ని తిరుపతికి మార్చారు లక్ష్మయ్య. తండ్రి కోరికనే తన లక్ష్యంగా మార్చుకున్న జగదీష్‌ ఇంటర్మీడియెట్‌ వరకూ తిరుపతిలో చదివారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌, మణిపాల్‌ మెడికల్‌ కాలేజీ నుంచి ఆర్థోపెడిక్స్‌లో ఎం.ఎస్‌. పూర్తిచేశారు. ఆయన సతీమణి నిర్మలాదేవి గైనకాలజిస్టు. వీరికి కవల పిల్లలు కల్యాణ్‌, కార్తిక్‌. కల్యాణ్‌ లండన్‌లో యూరాలజిస్టుగా స్థిరపడ్డారు. కార్తిక్‌ ఆర్థోపెడిక్‌ సర్జన్‌. హైదరాబాద్‌లో 'మా ఆర్థోపెడిక్‌ హాస్పిటల్‌'ను నిర్వహిస్తున్నారు. జగదీష్‌ ఇక్కడా తన సేవల్ని అందిస్తారు. డాక్టర్‌ జగదీష్‌ సేవలు మరింతకాలం బర్డ్‌ హాస్పిటల్‌ ద్వారా అందించడం కోసం బుధవారం తిరిగి బాధ్యతలను స్వీకరించనున్నారు. 1981లో వైద్యునిగా తన వృత్తిని ప్రారంభించిన జగదీష్‌ అంగవైకల్యం ఎవరికీ శాపం కాదని నిరూపిస్తూ, సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తూ నిత్యశ్రామికునిగా పేరు గడించారు.